
నిర్మాణం పూర్తి కాని సూపర్‌స్పెషాలిటీ వైద్యశాల

అడ్డంకులు తొలగేదెన్నడో?

'సూపర్' వైద్యానికి విచారణలు, నిధుల గండం

- వరంగల్ హెల్త్ సిటీ పనులపై వీడని గ్రహణం
- ఎయిర్ పోర్టు, టెక్స్‌టైల్ పార్కు యూజీడీపైనే ప్రభుత్వం దృష్టి
- పాలన మారి ఏడాది దాటినా వైద్యంపై దృష్టిపెట్టని వైనం
- ఎంజీఎంను పట్టించుకోరు.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని పూర్తి చేయరు
- మంత్రివర్గ భేటీల్లో ఒక్కసారీ చర్చించింది లేదు
- గత ప్రభుత్వ తప్పిదాలనే కాంగ్రెస్ కూడా కొనసాగిస్తోందంటూ విమర్శలు
- సర్కారు వైద్యాన్ని విస్మరిస్తున్నారంటూ ప్రజల అసంతృప్తి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటింది. ఇందిరమ్మ ప్రజాపాలనలో పేదల జీవితాలను మారుస్తామంటూ సర్కారు పదే పదే మాటలు చెబుతోంది. కానీ చేతలు మాత్రం గత ప్రభుత్వం తీరుగానే ఉన్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అందుకు వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి పనులే నిదర్శనంగా నిలుస్తున్నాయన్న అభిప్రాయా లున్నాయి. ఇప్పటికే పేదల బతులకు ఆధారంగా ఉన్న వరంగల్ ఎంజీఎంను పట్టించుకోవడం లేదని.. గత ప్రభుత్వం నిర్మాణం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ అస్పత్రి పనులను ప్రస్తుత సర్కారు పూర్తి చేయడం లేదని పేదలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మెడలో పుస్తెల తాడు నుంచి గుడిసెలను కూడా తాకట్టు పెట్టి అస్పత్రి బిల్లులు చెల్లించాల్సి వస్తుందని వారు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ ఏడాది కాలంగా ఎయిర్ పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, ఐటీ పార్కు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ (యూజీడీ) పనులకే ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం పేదలకు ప్రాణం పోసే వరంగల్ ఎంజీఎంతో పాటు సూపర్‌స్పెషాలిటీ అస్పత్రిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదనన్న ప్రశ్నలు ఉత్పన్నమవు తున్నాయి. పలుమార్లు మంత్రి వర్గ సమావేశాలు జరిగినా.. వరంగల్ హెల్త్ సిటీ, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రులపై సమీక్షించకపోవడం పట్ల ఆక్షేపణలు వ్యక్తమవుతున్నాయి. అడ్డంకులు తొలగి ఎప్పుడు తమకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా..

56 ఎకరాల్లో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రితో పాటు ఎంజీఎం అస్పత్రి, కాకతీయ మెడికల్ కాలేజీ, కాళోజీ హెల్త్ యూనివర్సిటీ అన్ని కూడా ఒకే కాంప్లెక్స్ పరిధిలోకి తెచ్చేలా వరంగల్ హెల్త్ సిటీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అన్ని రకాల వైద్య సేవలతో పాటు మెడికల్ కాలేజీలు, యూనివర్సిటీలు ఒకే గొడుకు కిందికి వస్తుండటంతో సుమారు 215 ఎకరాల్లో వరంగల్ హెల్త్‌సిటీగా అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని గత ప్రభుత్వం భావించింది. ప్రధానంగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రిలో పేదలకు 34 విభాగాల్లో సూపర్‌స్పెషాలిటీ వైద్యం అందించనున్నారు. ప్రధానంగా గుండె మార్పిడికి ప్రత్యేకంగా థియేటర్, కాలేయ, కిడ్నీ తదితర అవయాల మార్పిడి, యూరాలజీ, నెప్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, పీడియాట్రీక్ సర్జరీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, జనరల్ మెడిసిన్, క్యాన్సర్ ట్రీట్‌మెంట్ తదితర వాటి కోసం ప్రత్యేకంగా విభాగాలను ఈ సూపర్ స్పెషాలిటీ అస్పత్రిలో ఏర్పాటు కానున్నాయి. డెంటల్ కాలేజీని

మిగతా 7వ పేజీలో...

మంత్రులు, ఎమ్మెల్యేలూ జర చూడండి...

ఎంజీఎం పరిస్థితి దారుణంగా మారింది. వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు కనీసం పూర్తిస్థాయిలో మందులు కూడా లేని దుస్థితి. మంత్రి కొండా సురేఖ ప్రాతినిధ్యం వహిస్తున్న వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలోనే ఎంజీఎం ఉండగా.. ఆమె కూడా ఎంజీఎంలో నెలకొన్న సమస్యలపై ఎంజీఎం వైద్యాధికారులతో సమీక్షించకపోవటంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పేదల పక్షాన పోరాడే వ్యక్తులుగా పేరున్న కొండా దంపతులు పేదల అస్పత్రిపై దృష్టి పెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. మొదట్లో ఎంజీఎం అభివృద్ధిపై దూకుడుగా వెళ్లిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఇటీవల మౌనం వహిస్తుండటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌లో కూడా మెరుగైన ప్రభుత్వ వైద్యం పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలతో పాటు ఎమ్మెల్యేలపై ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంజీఎంలో పేదలకు పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందేలా చూడటంతో పాటు సూపర్ స్పెషాలిటీ అస్పత్రిని పూర్తి చేసి, పేదలకు సూపర్ వైద్య సేవలు అందేలా మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేయాలని ఓరుగల్లు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదల ఆస్పత్రికి అభ్యంతరాలు, విచారణల గ్రహణం

వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మిస్తే చుట్టుపక్కల ఉన్న నాలుగైదు ఉమ్మడి జిల్లాల ప్రజలకు కూడా ప్రయోజనం చేకూరుతుందనే గత ప్రభుత్వం వరంగల్ హెల్త్ సిటీకి ప్లాన్ చేసింది. గత ప్రభుత్వం 24 అంతస్థుల్లో రూ.1,100 కోట్ల అంచనా వ్యయంతో సూపర్‌స్పెషాలిటీ అస్పత్రి పనులు చేపట్టినట్లుగా జీవో నెం.158ని విడుదల చేసింది. అయితే ఏడాది కాకముందే ఏలాంటి అనుమతులు లేకుండా రూ.1,725.95 కోట్లకు గత ప్రభుత్వం పెంచింది. అదనంగా రూ.625.95 కోట్ల వ్యయాన్ని పెంచటంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తప్పు పట్టింది. అంతేకాకుండా అస్పత్రి నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు లేకపోవటంతో తెలంగాణ స్టేట్ సూపర్ స్పెషాలిటీ హస్పిటల్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్)ను గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కార్పొరేషన్‌కు జైలు భూమి సర్వే నెంబరు 31,32లోని 2,75,759గజాల స్థలాన్ని (56 ఎకరాలు) బదిలీ చేస్తూ జీవో నెం.81ని జారీ చేసింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి వరంగల్ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి కోసం బ్యాంక్ ఆఫ్ మహరాష్ట్ర, హైదరాబాద్ నుంచి రూ.1,173 కోట్ల రుణం తీసుకున్న విషయం వెలుగులోకి వచ్చింది. ఈ రెండు ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణకు ఆదేశించారు. ఆగస్టు 30వ తేదీన విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు.


రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అర్జున అవార్డు అందుకుంటున్న జీవంజి దీప్తి

రాష్ట్రపతి నుంచి.. 'అర్జున' అందుకున్న దీప్తి

వరంగల్ స్పోర్ట్స్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అంగవైకల్యాన్ని జయించి రికార్డుల రారాణిగా సత్తా చాటి ప్యారిస్‌లో జరిగిన పారా ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పారా ఒలింపియన్ జీవంజి దీప్తి కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అర్జున అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. ఉమ్మడి వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన ఆమె శుక్రవారం న్యూ ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అర్జున అవార్డును అందుకున్నారు. విధి రాతను చెరిపి, ఎన్నో అవమానాలు, అవహేళనలు భరించి క్రీడల్లో రాణించమే ధ్యేయంగా దేశ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్ నుంచి శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన ఆమె ఈ అత్యున్నత పురస్కారాన్ని అందుకోవడం పట్ల క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పారా ఒలింపిక్స్‌లో అర్జున పురస్కారాన్ని అందుకున్న తొలి తెలుగు పారాలింపియన్‌గా దీప్తి నిలవడం గర్వకారణమంటూ ఉమ్మడి వరంగల్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ అథ్లెట్లు, క్రీడా అభిమానులు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

లక్ష డప్పులతో తరలిరావాలి

- 'వెయ్యి గొంతుకలు-లక్ష డప్పుల సభ' ద్వారా మాదిగల ఆవేదనను తెలపాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

నెహ్రూసెంటర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే 'వెయ్యి గొంతుకలు-లక్ష డప్పుల సభకు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ప్రపంచానికి మాదిగల ఆవేదన అర్థమయ్యేలా ఉప్పెనలా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుంచి నెహ్రూసెంటర్, ఆర్టీసీ బస్టాండ్ మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంద కృష్ణమాదిగ దరువేసి, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలను ఉత్తేజపరిచారు. అనంతరం ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటే డప్పుచప్పుళ్లతో సమాధానం చెబుతామన్నారు. మునుపెన్నడు లేని విధంగా లక్ష డప్పులతో హైదరాబాద్‌కు తరలివస్తే ప్రపంచమే అదరాలని చెప్పారు. ఈ సమావేశంలో గుగ్గిళ్ల పీరయ్య, దుప్పెల్లి అనిల్, ఎండీ పాష, కత్తుల రేణుక, పోలెపాక ఎల్లయ్య, బోడ సుమిత్ర, మిట్టపల్లి యాకన్న, జబర్దస్త్ రాజమౌళి, కళాకారుడు రాంబాబు, యాకన్న, మణెమ్మ, ప్రవీన్, శ్రీనివాస్, మల్లన్న, ఉప్పలయ్య, కృష్ణయ్య, శంకర్, వీరస్వామి, అంబరీష, దైద భద్రయ్య, కిన్నెర మల్లయ్య, మిర్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు ఉద్యమకారుల ఆత్మగౌరవ సభ

- 33 జిల్లాల నుంచి మానుకోటకు తరలిరానున్న ఉద్యమకారులు
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేత నారాయణ్‌సింగ్


మాట్లాడుతున్న నారాయణ్‌సింగ్

మహబూబాబాద్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో ఈ నెల 19న 'ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్ డీఎస్ నారాయణ్‌సింగ్ తెలిపారు. శుక్రవారం మహబూబాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద ఆయన మాట్లాడారు. ఆదివారం జరిగే సభకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి తెలంగాణ ఉద్యమకారులు పెద్దఎత్తున తరలివస్తున్నట్లు చెప్పారు. అనంతాద్రి దేవాలయం నుంచి మానుకోట తెలంగాణ అమరవీరుల స్థూపం వరకు ర్యాలీ, అనంతరం సభ ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూల నుంచి తెలంగాణ ఉద్యమకారులు పెద్దఎత్తున తరలి వచ్చి, సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం..

విద్యార్థులు, యువకులు, మేధావుల బలిదానాల పునాదులపై ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరిగిందని నారాయణ్‌సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు అన్యాయం చేసి, ఉద్యమద్రోహులను అందలం మెక్కించారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యమకారులను గౌరవించిందన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ప్రతీ ఒక్కరికి 250 గజాల ఇంటి స్థలం ఇస్తానన్న హామీని రాష్ట్ర సర్కార్ నిలుపుకోవాలన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు శంతన్‌రామరాజు, గుగులోతు రాములునాయక్, సోమారపు వీరస్వామి, గుంజె హన్మంతు, భూక్య రమేష్, బొర్రాజు లింగన్న, భూక్య రామునాయక్, వీరన్న పాల్గొన్నారు.

ప్రజల నిర్ణయాలకే ప్రాధాన్యం

- ఉద్యాన కేంద్ర సేవలను వినియోగించుకోవాలి
- మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్


జేవీఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రంలో మాట్లాడుతున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాప్రభుత్వంలో ప్రజల నిర్ణయాలకే అధిక ప్రాధాన్యత ఉంటుందని మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 1వ వార్డు పరిధి ఈదులపూసపల్లిలో ఎమ్మెల్యే సీడీఎఫ్ నిధులు రూ.5లక్షలతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేసి, మాట్లాడారు.

ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, డీఈ ఉపేందర్, వార్డు కౌన్సిలర్, కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ వెన్నం లక్ష్మారెడ్డి, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు ఖలీల్‌పాష, గట్ల శ్రీపాల్‌రెడ్డి, బుర్ర గోవర్ధన్ పాల్గొన్నారు.

కొత్తరకం వంగడాలను అందించాలి..

జేవీఆర్ ఉద్యానవన కేంద్రంలో పరిశోధనలు చేసి, కొత్తరకం వంగడాలను రైతులకు అందించాలని భూక్య మురళీనాయక్ అన్నారు. మల్యాలలో జేవీఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని సందర్శించి, ఆయన మాట్లాడారు. ఉద్యానవన కేంద్రసేవలను రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఉద్యాన పరిశోధన స్థానం హెడ్ కత్తుల నాగరాజు, శాస్త్రవేత్తలు ప్రశాంత్ కుమార్, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, కేవీకే శాస్త్రవేత్తలు కిషోర్, రాంబాబు, క్రాంతి పాల్గొన్నారు.

వైద్యకళాశాల భవనం పనులను పూర్తి చేయాలి..

మానుకోట జిల్లా కేంద్రం బీసీ కాలనీ శివారులో కొనసాగుతున్న వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. పట్టణంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. వైద్యవిద్యార్థుల హాస్టల్, కళాశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మెడికల్ కళాశాల భవనం పూర్తి కాక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ లకావత్ వెంకట్‌నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ బీమ్లానాయక్, వార్డు కౌన్సిలర్ బానోత్ హరిసింగ్, శంతన్ రామారాజు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారాలు చేస్తే సహించేది లేదు

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌నాయక్


సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌నాయక్

నెహ్రూసెంటర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమ వ్యాపారాలు చేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదని మహబూబాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ బాదావత్ కిరణ్‌నాయక్ హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోనిఎక్సైజ్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లాను గుడుంబా రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. నల్లబెల్లం, గుడుంబా, పటిక సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సీఐ చిరంజీవి, డీటీఎఫ్ సీఐ నీరజ, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఇంకా.. 8 రోజులే

- ముగియనున్న మున్సిపాలిటీ పాలకమండలి పదవీకాలం
- మానుకోటలో అభివృద్ధి, పెండింగ్ నిర్మాణాలపై దృష్టి
- కేంద్రం నుంచి నిధుల మంజూరుకు విజ్ఞప్తి


మహబూబాబాద్‌లో వైకుంఠధామం పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకన్న, అధికారులు (ఫైల్)

మహబూబాబాద్ టౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత మునిసిపల్ పాలకమండలికి పదవీ కాలం ఇంకా సరిగ్గా ఎనిమిది రోజులు మాత్రమే మిగిలి ఉంది. జనవరి చివరాంకంలో పదవీకాలం పూర్తి కానుంది. పాలకమండలి గడువు పూర్తయ్యే లోపు అభివృద్ధి, పెండింగ్ పనులు పూర్తిచేసి.. ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే సంకల్పంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు. నిత్యం పనులను పర్యవేక్షిస్తూ అధికారులకు సూచనలు చేస్తూ వాటిని పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు సాగుతున్నారు. తమ హయాంలోనే ప్రారంభోత్సవాలు చేసుకునేందుకు కృషి చేస్తున్నారు.

మహబూబాబాద్ మునిసిపాలిటీకి 22 జనవరి 2020న ఎన్నికలు జరిగాయి. 25న ఫలితాలు వెల్లడి కాగా, 27న కొత్త పాలకవర్గం కొలువుదీరింది. ఐదు సంవత్సరాల కాలపరిమితి ఈనెల 26 గణతంత్ర్య దినోత్సవం రోజుతో పదవీ కాలం ముగియనుంది. ఇక కొన్ని రోజుల గడువు మాత్రమే ఉండడంతో ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, మిగిలిపోయిన (పెండింగ్) పనులను పూర్తి చేసేందుకు శ్రమిస్తున్నారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న మునిసిపల్ అధికారులతో కలిసి నిత్యం అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తూ త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచిస్తున్నారు.


పెండింగ్ పనులపై నజర్..

మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో గత కొద్ది రోజులుగా అభివృద్ధి పెండింగ్ పనులపై దృష్టి సారించారు. నిర్మాణాలను కొనసాగుతున్న ప్రాంతాలను సందర్శిస్తూ.. పనుల వేగవంతానికి కృషి చేస్తున్నారు. మునిసిపాలిటీ 4వ వార్డు పరిధిలోని గాంధీపురం, 9 వవార్డు పరిధిలోని శనిగపురంలో, 7వ వార్డులోని రజాలిపేట వద్ద, 6వ వార్డు పరిధిలోని బేతోలులో నిర్మిస్తున్న వైకుంఠధామాల నిర్మాణాలను పరిశీలించారు. జాప్యం జరుగుతూ పనులు నత్తనడకన నడుస్తున్న నెహ్రూసెంటర్ నుంచి పత్తిపాక వరకు రోడ్డు విస్తరణ పనులను పర్యవేక్షించారు. రోడ్డు విస్తరణ పనుల పూర్తికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి

మిగతా 8వ పేజీలో...

మునిసిపల్ అభివృద్ధికి కృషి

పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, మునిసిపల్ చైర్మన్, మహబూబాబాద్



మహబూబాబాద్ మునిసిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు అందరి సహకారంతో శాయశక్తులా కృషి చేశాం. అన్ని వార్డుల్లో సమస్యల పరిష్కారానికి పాటు పడ్డాం. మునిసిపాలిటీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసి పనులను వేగవంతం చేశాం. నిత్యం పనులను పర్యవేక్షిస్తూ వాటిని త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం.


తొర్రూరులో చెప్పులు కుడుతున్న మంద కృష్ణ మాదిగ

వర్గీకరణ అమలుకు సుదీర్ఘ పోరాటం

- అడ్డుకుంటున్న మాలలు : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తొర్రూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మాదిగ ఉప కులాల వర్గీకరణ కోసం ముప్పై ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నామని, పోరాటాన్ని ప్రత్యక్షంగా, పరోక్షంగా మాలలు అడ్డుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల సభను విజయవంతం చేయాలని పట్టణంలో డప్పు కళాకారులతో అంబేద్కర్ సెంటర్ నుంచి బస్టాండ్ వరకు, అక్కడి నుంచి విశ్రాంతి భవనం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశ్రాంతి భవనంలో ఆయన మాట్లాడారు. మొదట అంబేద్కర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి వర్గీకరణ అమలుకు మాలలు అడుగడుగునా అడ్డు పడుతున్నారని విమర్శించారు. 1965లో లోకల్ కమిషన్, 1994లో రాంచందర్ రాజు కమిషన్‌లు వర్గీకరణకు అనుకూలంగా రిపోర్టులు ఇచ్చినా మాలలు కమిషన్లను కూడా పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ ఆవేదన, ఆకాంక్ష తెలియజేయడానికే ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే సభకు ఇంటికో డప్పును చంకన పెట్టుకుని రావాలని కోరారు. వర్గీకరణ అమలుకై రాష్ట్రంలో ప్రజలు, మేధావులు, అన్నివర్గాలు సంపూర్ణ మద్దతు తెలిపాయని, సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేస్తామని తెలిపి కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జున ఖర్గే ఆదేశాల మేరకు వర్గీకరణపై మాట్లాడకపోవడం సరికాదన్నారు.

వెంటనే తెలంగాణలో వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఉన్న కొందరు మాల నాయకులు ఆర్థికంగా బలోపేతంగా ఉండి వర్గీకరణను అడ్డుకుంటున్నారని విమర్శించారు. వర్గీకరణ పోరాటానికి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, మేధావులు పూర్తి మద్దతు తెలుపుతున్నాయని, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల జరిగిన సభలో వర్గీకరణకు అనుకూలంగా మాట్లాడడం అభినందనీయమని అన్నారు. ర్యాలీలో రోడ్డు పక్కన చెప్పులు కుట్టేవారితో మాట్లాడి చెప్పులు కుట్టారు. త్వరలోనే వర్గీకరణ వస్తుందని వారిక భరోసా ఇచ్చారు. తొర్రూరుకు హాజరైన మంద కృష్ణ మాదిగను మాదిగ ఉద్యోగ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఉద్యోగ సంఘాల నాయకులు సోమారపు ఐలయ్య, మహంకాళి బుచ్చయ్య, మంగళపల్లి రాంచంద్రయ్య, మంగళపల్లి శ్రీనివాస్, ఎన్.వెంకన్న, సుంచు సంతోష్, రంజిత్, భిక్షపతి, బి.వెంకన్న, ఆర్.ఉపేందర్, పూర్ణచందర్, సురేందర్, రమేష్, తదితరులు ఉన్నారు.

నవోదయ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వెంకటాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో శనివారం నిర్వహించే నవోదయ ప్రవేశ పరీక్షలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వెంకటాపురం, వాజేడు మండలాల నుంచి 112 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు నవోదయ పరీక్ష ఇన్‌చార్జి రామకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణలు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రంలో 45 మంది ఇంగ్లిష్ మీడియం, 67మంది తెలుగుమీడియం విద్యార్థులు పరీక్ష రాయనున్నారన్నారు. పరీక్ష ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందని, విద్యార్థులు ఉదయం 10 గంటలలోపే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బొల్లె శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7 నుంచి మహా కుంభాభిషేకం

- పుష్కరాల పనుల్లో వేగం పెంచాలి
- జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో ఆలయంలో మహా కుంభాభిషేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మే 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతి పుష్కరాలు, ఫిబ్రవరిలో జరిగే మహా కుంభాభిషేక కార్యక్రమాల నిర్వహణ, అభివృద్ధి పనులపై శుక్రవారం కాళేశ్వరం ఈవో కార్యాలయంలో దేవస్థానం, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ వైద్య శాఖ జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాళేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే మహా కుంభాభిషేకానికి సుమారు 20 వేల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గోపురం పనులు పూర్తి చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. సరస్వతి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు మరుగుదొడ్లు, లైటింగ్, దుస్తులు మార్చుకునేందుకు గదులు, స్నానాలు చేయడానికి కుళాయిలు, వాహనాల పార్కింగ్ స్థలం తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. అన్ని శాఖల సమన్వయంతో పనులు త్వరగా పూర్తి కావాలని ఆదేశించారు. పుష్కరాల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. చేపట్టాల్సిన పనులు, నివేదికల్లో మార్పులు ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సరస్వతి పుష్కరాలకు సంబంధించిన


కాళేశ్వరంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

పనులు ఏప్రిల్ 30 లోపు ముగియాలని తెలిపారు. గోదావరి ఘాట్ వద్ద ప్రమాదాలు జరుగకుండా ఎప్పటికప్పుడు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. నదిలో వెళ్లడానికి అనువుగా తాత్కాలిక రోడ్డు నిర్మించాలని తెలిపారు. పుష్కరాలకు పెద్ద సంఖ్యలో భక్తులు రానున్నందున వాహనాల పార్కింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. ఆర్ అండ్ బీ నుండి గంగారం క్రాస్, కాళేశ్వరం వరకు రోడ్డు మరమ్మతు చేసి రోడ్డు నిర్మాణం చేయాలని సూచించారు. తాత్కాలిక బస్టాండ్ ఏర్పాటు స్థలం, వీఐపీ ఘాట్, ప్రధాన ఘాట్ నుంచి వీఐపీ ఘాట్ వరకు రెండు వరుసల రహదారి నిర్మాణం చేపట్టే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఏఎస్పీ బోనాల కిషన్, డీపీవో నారాయణరావు, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖల అధికారులు, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

సిద్ధంగా ఉండాలి : డీఎంహెచ్‌వో మధుసూదన్

కాళేశ్వరంలో జరిగే సరస్వతి పుష్కరాలకు వైద్య సిబ్బంది, అధికారులు సిద్ధంగా ఉండాలని డీఎంహెచ్‌వో మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కాళేశ్వరం పీహెచ్‌సీలో సమావేశం నిర్వహి చారు. మే నెలలో జరిగే సరస్వతి పుష్కరాలకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మెడికల్ క్యాంపులు, సిబ్బంది, కావాల్సిన సామగ్రి, మందులు చేయాల్సిన ఏర్పాట్లు, వసతులు, కుంభాభిషేకంలో ఏర్పాటు చేసే క్యాంపుల గురించి సిబ్బందితో చర్చిం చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీవీబీడీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, మదర్, చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ప్రమోద్, డాక్టర్ బాసా నాయక్, డాక్టర్ సుస్మిత ఆధ్వర్యంలో పీహెచ్‌సీ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు.

మేడారంలో మెరుగైన భద్రత

- ములుగు ఎస్పీ శబరీష్
- మినీ జాతరకు ఏర్పాట్ల పరిశీలన


వీవీఐపీల పార్కింగ్ వద్ద కూలిన వంతెనను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీష్

మేడారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం మినీ జాతరకు తరలి వచ్చే భక్తులకు మెరుగైన భద్రత కల్పించనున్నామని ఎస్పీ శబరీష్ అన్నారు. మేడారం పర్యటనలో భాగంగా శుక్రవారం ములుగు డీఎస్పీ రవీందర్ పోలీసులతో కలిసి జంపన్నవాగు స్నాన ఘట్టాలు, వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలాలు, రోడ్లు, క్యూలు, గద్దెల పరిసరాల్లోని సీసీ కెమెరాలు తిరిగి పరిశీలించారు. భక్తుల రద్దీ ప్రాంతాలను గుర్తించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వీఐపీ, వీవీఐపీ పార్కింగ్ స్థలానికి వెళ్లే దారిలో కూలిన వంతెనను తాత్కాలిక మరమ్మతు చేపట్టాలన్నారు. గద్దెలకు సమీపంలో వాహనాలు వచ్చేలా పలు పార్కింగ్ స్థలాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా మెరుగైన ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. జంపన్నవాగు నుంచి గద్దెల వరకు 37సీసీ కెమెరాలను మరమ్మతు చేస్తామని, దేవస్థానంలోని 16సీసీ కెమెరాలు కలిపి కమాండ్ కంట్రోల్ రూమ్ మానిటర్‌కు లింక్ చేయడం జరుగుతుందన్నారు. గద్దెల వద్ద దొంగలను పట్టుకోవడానికి ప్రత్యేక సీసీఎస్ పోలీస్ బృందం ఉంటుందని భక్తులకు సులువుగా దర్శనాలు జరిగేలా ఏర్పాటు చేయనున్నటు తెలిపారు. ట్రాఫిక్ అంతరాయాలు జరగకుండా గ్రామంలో వన్‌వే రూట్ మ్యాప్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిర్దేశిత పార్కింగ్ స్థలాలకు వాహనాలు తరలించేలా పకడ్బందీగా ప్రణాళికలు చేపట్టనున్నట్లు తెలిపారు. మినీ జాతరకు 40లక్షల మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయని అన్నారు. అందుకు అనుగుణంగా భద్రతా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం గత మినీ జాతరల సమస్యలను పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పస్రా సీఐ జీ రవీందర్, తాడ్వాయి, పస్రా ఎస్సైలు శ్రీకాంత్ రెడ్డి, కమలాకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పత్తి చేనులోకి దూసుకెళ్లిన బస్సు

గోవిందరావుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పత్తి చేనులోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని మచ్చాపూర్ - చల్వాయి గ్రామాల సమీపంలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. వరంగల్ -2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హనుమకొండ నుంచి 50 మంది ప్రయాణికులతో మంగపేటకు బయలుదేరింది. ఈక్రమంలో మచ్చాపూర్ మీదుగా చల్వాయికి చేరుకుంటుండగా అదుపుతప్పి రోడ్డుపక్కన పత్తి చేనులోకి దూసుకెళ్లింది. కొందరు ప్రయాణికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే డ్రైవర్, కండక్టర్ ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. కాగా, బస్సు స్టీరింగ్ లాక్ కావడం, బ్రేకులు కంట్రోల్ కాకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది.


ప్రమాదానికి గురైన బస్సు

దివ్యాంగులకు ఉపకరణాల కోసం ఎంపిక శిబిరాలు

మహబూబాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు, వయోవృద్ధులకు ఆలింకో వారి సహకారంతో ఈనెల 20 నుంచి 24 వరకు ఉపకరణాలను అందించేందుకు ఎంపిక శిబిరాలు నిర్వహించనున్నట్లు మహబూబాబాద్ జిల్లా సంక్షేమ అధికారి ధనమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న మహబూబాబాద్‌లోని గిరిజన భవన్, 21న మరిపెడలోని ఇండోర్ స్టేడియం, 22న రత్నం ఇంజనీర్ హౌస్ పక్కన ఉన్న హాల్, డోర్నకల్, 23న తొర్రూరు రైతువేదిక, 24న కొత్తగూడ రైతువేదికలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరాల్లో బ్యాటరీ ట్రైసైకిల్, వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, అంధులకు చేతికర్రలు, వాకింగ్ స్టిక్ మొదలగు ఉపకరణాల నుంచి అందించేందుకు ఎంపిక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దివ్యాంగులు, వయోవృద్ధులు యూటీఐడీ కార్డు, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఆదాయం ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. యూటీఐడీ కార్డు లేనివారు యూటీఐడీ పోర్టల్ నందు పేరు నమోదు చేసుకుని జిరాక్స్ పత్రాలను అందించాలన్నారు. ఇతర వివరాలకు సెల్ : 91334 15312, 91772 60816 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ట్రాక్టర్, కారు ఢీ

- నలుగురికి తీవ్రగాయాలు.. ఎంజీఎంకు తరలింపు

ఏటూరునాగారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్య శుక్రవారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారులో ఉన్న నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎస్సై తాజుద్దీన్ కథనం మేరకు... ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన ఎమ్మీ. సైద్ ఇటీవల మృతి చెందగా ఆయన దశదినకర్మ కార్యక్రమానికి నర్సంపేటకు చెందిన మృతుని బంధువులు నర్సంపేట నుంచి ఏటూరునాగారంకు కారులో వస్తున్నారు.

కాగా, ఏటూరునాగారం-హనుమకొండ జాతీయ రహదారి 163 మధ్యలోని మండలంలోని చింతలమోరి సమీపన అదే సమయంలో మండలంలోని చిన్నబోయినపల్లి వైపు నుంచి తాడ్వాయి మండలం మేడారానికి వెళ్తున్న ట్రాక్టర్‌ను నర్సంపేట నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్న కారు అతివేగంగా కారు డ్రైవర్ అదుపు చేయలేక ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ టైర్లు పేలిపోయి ట్రాక్టర్ ఇంజిన్, గేర్ బాక్స్ రెండుగా విడిపోయాయి. కాగా, ఈ ప్రమాదంలో నర్సంపేటకు చెందిన మహబూబ్ పాషా(55) ఎడమ కాలు విరుగగా, యాకోబి (44) రెండు కాళ్లు విరిగిపోయాయి. అంతేకాకుండా ఆశాబి (45) రెండు చేతులు విరుగగా, హయుబ్ (55)కు తలకు గాయం అయింది. ట్రాక్టర్ డ్రైవర్ మడప రాంబాబు(35) తలకు గాయమైంది.


ప్రమాదంలో ఇంజిన్, గేర్ బాక్స్ రెండుగా విడిపోయిన ట్రాక్టర్

ఈ విషయం తెలుసుకున్న ఎస్సై తాజుద్దీన్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను హుటాహుటిన పోలీస్ సిబ్బంది సాయంతో ప్రైవేట్ వాహనం ద్వారా మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, వైద్యులు క్షతగాత్రులకు ప్రాథమిక వైద్యం అందించి వారి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నలుగురికి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో కారు, ట్రాక్టర్లు నుజ్జునుజ్జు కాగా, ట్రాక్టర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వనదేవతలకు ముందస్తు మొక్కులు

మేడారం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క సారలమ్మలకు ముందస్తు మొక్కుల సందడి శుక్రవారం అధికంగా నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రవేటు వాహనాల్లో తరలివచ్చారు. మరో 25రోజుల్లో వనదేవతల మినీ జాతర జరగనుంది. ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు పూజారులు ప్రత్యేక, రహస్య పూజలు చేయనున్నారు. ముందుగా మేడారం వస్తున్న భక్తులు అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. 10వేలకు పైగా భక్తులు దేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

మేడారంలో భక్తుల సందడి రోజురోజుకు అధికం అవుతుంది. కలెక్టర్ దివాకర ఆదేశాల మేరకు జిల్లా పంచాయితీరాజ్ అధికారి దేవరాజ్ ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు జరుగుతున్నాయి. రాజమండ్రి నుంచి 70 మంది, ములుగు జిల్లా చల్వాయి గ్రామం నుంచి 20 మంది, స్థానిక పారిశుధ్ధ కార్మికులతో పనులు రోజు వారిగా చేపడుతున్నారు. పోగు చేసిన చెత్తను వెంటనే నాలుగు ట్రాక్టర్‌ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. మేడారంలో పారిశు ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడంతో పరిసరాలు శుభ్రంగా ఉంటు న్నాయని భక్తులు తెలుపుతున్నారు. కాగా మేడారంలో ప్లాస్టిక్ నియం త్రణపై పలు ప్రచారాలు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా ఫలితం కనిపించడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హత్యకు గురైన నాగమణిది గుంటూరు!

'సిగ్నల్‌కాలనీ' కేసులో కీలక సమాచారం లభ్యం


నాగమణి (ఫైల్)

మహబూబాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సిగ్నల్ కాలనీలో హత్యకు గురైన తాటి నాగమణి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా మంగళగిరి మండలం, వెంకటొరెడ్డిపల్లె గ్రామానికి చెందినదిగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం. సిగ్నల్ కాలనీలో నివాసముండి అదృశ్యమైన మృతురాలి నాగమణి ఆడబిడ్డ రావూరి దుర్గది ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం కావడంతో నాగమణిది కూడా అదే ప్రాంతానికి చెంది ఉంటుందని అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు నాగమణిని గుంటూరు జిల్లా వాసిగా గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు కూడా తమ కూతురేనని అంగీకరించినట్లు తెలిసింది. వారిని మహబూబాబాద్‌కు రప్పిస్తున్నట్లు సమాచారం. వారి వద్ద వివరాలు సేకరించి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయనున్నారు. ఇప్పటికే నాగమణిని ఆమె భర్త, అత్త, మామ, అడబిడ్డ కలిసి హత్య చేయడానికి గల కారణాలు తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని అర్హులైన అభ్యర్థులు వివిధ ఉద్యోగ నియామక ఉచిత పోటీపరీక్షలకు ఈనెల 20వ తేదీ నుంచి ఫిబ్రవరి 9 వరకు దరఖాస్తు చేసుకోవాలని స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ. ప్రసాద్ శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీ, బ్యాంక్ ఉద్యోగాల నియామకాల కోసం అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. 50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ. 2 లక్షలకు మించరాదన్నారు. ఎంపిక విధానం ఇంటర్, డిగ్రీలో పొందిన మార్కులు, రిజర్వేషన్ ప్రకారం ఉంటుందన్నారు. అర్హత గల అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఫిబ్రవరి 12వ తేదీ నుంచి 14 వరకు ఉంటుందన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ నుంచి 100 రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 0870-2571192, 040-24071178 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు
(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6150	5600
పల్లికాయ (పచ్చిది)	4800	4100
కందులు	6802	5560
పెసళ్లు	7153	6570
పత్తి	7260	5800
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	14800	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్ ఏసీ	15000	11000
యూఎస్341ఏసీ	16000	11000
దేశీ ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

- వాహనాలను బాధ్యతాయుతంగా నడపాలి
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వాహనాలు నడిపేటపుడు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని తొర్రూరులోని చాంబర్ ఆఫ్ కామర్స్‌లో మదర్ వలంటరీ ఆర్గనైజేషన్, రవాణా శాఖ అధికారులు చేపట్టిన అవగాహన సదస్సుకు హాజరై మాట్లాడారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి హెల్మెట్ ధరించాలన్నారు. నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎక్కువ దూరం ప్రయాణించవచ్చని, వర్షాకాలంలో ప్రయాణాల సమయంలో తీసుకోవా ల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తప్పనిసరిగా వాహనాలు నడిపేప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. మదర్ వలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయప డిన వారికి హెల్మెట్‌లు పంపిణీ చేశారు. సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్ర మాలు చేపట్టడం ఎంతో అభినందనీయమన్నారు. సంస్థ నిర్వాహకులు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని శాలువా మెమెంటోలతో సత్కరించారు. కార్యక్రమంలో డీటీవో జైపాల్ రెడ్డి, మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సాయిచరణ్, మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య, వైస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, మేకల కుమార్, ముత్తినేని సోమేశ్వర్ రావు, విజయ్‌పాల్ రెడ్డి, దేవరకొండ శ్రీను, సంస్థ వ్యవస్థాపకుడు సిరికొండ విక్రమ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

గ్రూప్-2 పరీక్ష 'కీ' విడుదల

» ఈ నెల 22 వరకు అభ్యంతరాలకు అవకాశం

హైదరాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) గత డిసెంబరు 15, 16 తేదీల్లో నిర్వహించిన గ్రూప్-2 రాత పరీక్ష 'కీ'ని శుక్రవారం విడుదల చేసింది. నాలుగు సెషన్లలో జరిగిన నాలుగు ప్రశ్నపత్రాల ప్రిలిమినరీ 'కీ'తో పాటు మాస్టర్ ప్రశ్న పత్రాలను కమిషన్ వెబ్‌సైట్ (www.tspsc.gov.in)లో అందుబాటులో ఉంచినట్లు కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలు ఏమైనా ఉంటే అభ్యర్థులు లాగిన్ అయి ఆంగ్లంలో సమర్పించాలని, అభ్యంతరాలతోపాటు వాటిని రుజువు చేసే ఆధారాలను కూడా సమర్పించాలని సూచించారు. ఈ నెల 18 నుంచి 22వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు 'కీ'పై అభ్యంతరాలను సమర్పించాలని తెలిపారు. ఈ-మెయిల్ లేదా వ్యక్తిగతంగా సమర్పించే విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.

ఇంటర్ ఫీజు గడువు 25 వరకు పొడిగింపు

వచ్చే మార్చిలో జరగనున్న ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షలకు రూ.2,500 అపరాధ రుసుముతో దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 25వ తేదీ వరకు ఇంటర్‌బోర్డు పొడిగించింది. కాగా, జాతీయ ప్రతిభా పురస్కారాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈ నెల 19వ తేదీ వరకు పొడిగించినట్లు తెలంగాణ ఇంటర్ బోర్డు ప్రకటించింది. దరఖాస్తులను http://scholarships.gov.inలో సమర్పించాలని సూచించింది.

చర్లపల్లిలో ట్రాన్స్‌జెండర్లకు ఓఎస్‌ఓపీ స్టాల్

హైదరాబాద్, జనవరి 17(ఆంధ్రజ్యోతి): చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్'(ఓఎస్‌ఓపీ) స్టాల్‌ను కేటాయించారు. జాస్మిన్ అనే ట్రాన్స్‌జెండర్ ఎంటర్‌ప్రెన్యూర్ ఈస్టాల్‌లో చిరుతినుబండారాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. త్రిపుర, సహస్ర అనే ఇద్దరు జనపనార సంచులను ఇక్కడ విక్రయిస్తున్నారు. అలాగే కిరణ్‌రాజ్ అనే ట్రాన్స్ మ్యాన్ తయారు చేసిన సబ్బులను అందుబాటులో ఉంచారు. చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ఓఎస్‌ఓపీ స్టాల్‌ను నిర్వహించే అవకాశం ట్రాన్స్‌జెండర్లకు లభించడం పట్ల దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ హర్షం వ్యక్తం చేశారు.

బరువు తగ్గలేదు కదా.. ఆ ఫీజు వెనక్కివ్వండి

» కలర్స్ హెల్త్‌కేర్‌కు రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఆదేశం

హైదరాబాద్ సిటీ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బరువు తగ్గింపు చికిత్స సఫలం కాకపోవడంతో వసూలు చేసిన ఫీజును తిరిగి చెల్లించాలని రాష్ట్ర వినియోగదారుల ఫోరం ఓ సంస్థను ఆదేశించింది. 'వెయిట్ లాస్ ట్రీట్‌మెంట్' పేరుతో వసూలు చేసిన రూ.1.05 లక్షల ఫీజు, దానిపై 9% వడ్డీతోపాటు రూ.50 వేల పరిహారం చెల్లించాలన్న జిల్లా ఫోరం తీర్పును సమర్థించింది. ఎద్దుమైలారం ప్రాంతానికి చెందిన ఓ విద్యార్థిని అధిక బరువు తగ్గించుకునేందుకు 2022 ఏప్రిల్‌లో కలర్స్ హెల్త్‌కేర్ ఇండియాను ఆశ్రయించింది. ఆ సంస్థ నిపుణులు క్రిప్టో ట్రీట్‌మెంట్ ద్వారా 20 కిలోల వరకు బరువు తగ్గవచ్చని చెప్పారు. వెంటనే రూ.50 వేలు చెల్లించిన ఆ విద్యార్థిని 8 నెలల పాటు చికిత్స తీసుకుంది. చికిత్స తీసుకుంటున్న సమయంలో మరో రూ.55 వేలు చెల్లించింది. చికిత్స తీసుకున్న తర్వాత కూడా బరువులో మార్పులేకపోవడంతోపాటు, ఆ సంస్థ డైటీషియన్‌లు, వైద్యులు తనతో అమర్యాదకరంగా ప్రవర్తించారని ఆమె ఆరోపించింది. తనకు జరిగిన సేవాలోపానికి పరిహారం కోరుతో మెదక్ జిల్లా ఫోరంలో ఫిర్యాదు చేసింది. ఇరువర్గాల వాదనలు విన్న జిల్లా ఫోరం చికిత్స పేరుతో వసూలు చేసిన రూ.1.05 లక్షలు, దానిపై 9% వడ్డీ, రూ.50 వేల పరిహారం చెల్లించాలని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాలు చేస్తూ కలర్స్ హెల్త్ కేర్ ఇండియా ప్రతినిధులు రాష్ట్ర ఫోరాన్ని ఆశ్రయించారు. రాష్ట్ర ఫోరం ఇన్‌ఛార్జ్ అధ్యక్షుడు మీనా రంగనాథన్, సభ్యుడు వి.వి. శేషుబాబుల ధర్మాసనం కలర్స్ హెల్త్‌కేర్ అప్పీలును కొట్టివేసింది. పరిహారం చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రజలు, మేధావుల మద్దతు మాదిగలకే..

ఫిబ్రవరి 7న హైదరాబాద్‌కు తరలిరావాలి

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ



తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకుల మద్దతుతో పాటు ప్రజల మద్దతూ మాదిగలకే ఉన్నా.. 30 ఏండ్ల పోరాటానికి మాలలు అడ్డుపడుతున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించే వెయ్యి గొంతుకలు, లక్ష డప్పుల సభను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం తొర్రూరులో డప్పు కళాకారులతో ర్యాలీ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ వర్గీకరణకు అనుకూలమైనా కొంతమంది ఆ పార్టీలో ఉన్న మాల నాయకులు వ్యతిరేకమని, వారి మూలంగానే తెలంగాణలో వర్గీకరణ అమలు ఆగుతుందని ఆరోపించారు. వర్గీకరణ పోరాటం చివరి దశకు చేరిందని, ఈ ఆఖరి పోరాటానికి అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు, మేధావుల పూర్తి మద్దతు ఉందని చెప్పారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి వర్గీకరణ అమలులో జాప్యం చేయవద్దని ఆయన కోరారు.

వర్గీకరణ కోరే వారిని బహిష్కరించాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి



గోదావరిఖని, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : షెడ్యూల్డ్ కులాల వర్గీకరణను సమర్థించే వారిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి, రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో రామ్మూర్తి మాట్లాడారు. డిసెంబరు 1న నిర్వహించిన మాలల సింహగర్జనను జీర్ణించుకోలేక వర్గీకరణను సమర్థించేందుకు మంద కృష్ణ మాదిగ సూడో మేధావులను సమీకరించుకుంటూ బహుజనుల ఐక్యతకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. బహుజనుల ఐక్యత కోసం మాల మహానాడు ఆధ్వర్యంలో 2 వేల గొంతులు, 2 లక్షల గుతుపలతో బల ప్రదర్శన చేస్తామని చెప్పారు. వర్గీకరణను సమర్థిస్తే రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వారవుతారని, రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వాళ్లకు దేశంలో ఉండే అర్హత లేదన్నారు. దేశాన్ని కులాలు, మతాలుగా వర్గీకరిస్తూ మనువాదాన్ని బలపరుస్తున్న బీజేపీకి అనుకూలంగా వ్యవహరించడం మానుకోవాలని, లేదంటే ప్రజలు మంద కృష్ణను కొట్టి చంపే రోజు వస్తుందని ఆయన హెచ్చరించారు.

పెట్రోల్ బంకు, ఫంక్షన్ హాలుకూ రైతుబంధు

(మొదటిపేజీ తరువాయి)

ఇలాంటి సిత్రాలు ఎన్నో ప్రస్తుత సర్వేలో బయటపడుతున్నాయి. పెట్రోల్ బంకు, ఫంక్షన్ హాళ్లు, పార్కింగ్ స్థలాలను నిర్వహిస్తున్న భూములకూ కొందరు ఆరేళ్ల పాటు రైతు బంధు సాయం పొందినట్టు తెలుస్తోంది.

పెట్రోలు బంకు, ఫంక్షన్ హాల్‌కు 'పెట్టుబడి సాయం'

జనవరి 26 నుంచి రైతు భరోసా పథకం అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే పెట్టుబడి సాయం అందించాలని అనుకుంటోంది. ఈ నేపథ్యంలో సాగుకు యోగ్యం కానీ భూముల గుర్తింపునకు అధికారులు గురువారం నుంచి క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. సర్వే నెంబర్ల ఆధారంగా గతంలో రైతుబంధు పొందిన భూముల వివరాలను పరిశీలిస్తున్నారు. సర్వే వివరాలతో సీసీఎల్ఏకు రోజువారీ నివేదికలు పంపిస్తున్నారు. అయితే, క్షేత్రస్థాయి విచారణలో పలు అంశాలు రెవెన్యూ అధికారులను ఆశ్చర్యపరుస్తున్నాయి. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలో ఉన్న కర్తనూర్‌లో ఓ పెట్రోల్ బంకుకు రైతు బంధు తీసుకుంటున్నారు. సదరు భూమిలో కొన్నేళ్లుగా పెట్రోల్‌బంకు కొనసాగుతున్నా.. సాగు భూమిగా చూపి రైతుబంధు పొందినట్లు గుర్తించారు. అదే ప్రాంతంలో మరో వ్యక్తి 10 ఎకరాల్లో ఫంక్షన్ హాల్ నిర్మించి దానిని నెలకు రూ.లక్షకు మరొకరికి అద్దెకు ఇచ్చారు. కానీ, ఆ ఫంక్షన్ హాల్ భూమికీ రైతు బంధు కింద సాయం పొందినట్లు గుర్తించారు. తెల్లాపూర్‌లో ఓ వ్యక్తి కార్ పార్కింగ్ కోసం కేటాయించిన నాలుగు గుంటల స్థలానికి రైతు బంధు పొందుతున్నారు. కొన్నిచోట్ల ఆలయాలకు, మరి కొన్ని చోట్ల పరిశ్రమలకు, లేఅవుట్లుగా ఉన్న స్థలాలకు, నాలా పొందిన భూములకు కూడా చెల్లింపులు జరిగినట్టు అధికారులు తమ సర్వేలో గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి ఉదంతాలు బయటికొస్తున్నాయి. ముఖ్యంగా రాజధానికి ఆనుకుని ఉన్న జిల్లాల్లో సాగులో లేని వేల ఎకరాల భూములకు రైతు బంధు చెల్లించినట్లు తాజా సర్వేలో వెలుగుచూస్తోంది.

ఆరేళ్లలో రూ.25,672 కోట్లు పక్కదారి

వ్యవసాయ శాఖ గత ఏడాది జూలైలో మంత్రివర్గ ఉపసంఘానికి ఇచ్చిన నివేదిక ప్రకారం.. గత ప్రభుత్వ పాలనలో రైతు బంధు కింద ఆరేళ్లలో.. సాగు చేయని భూములకు రూ.25,672 కోట్లు పెట్టుబడి సాయం అందింది. మొత్తం 12 విడతల్లో రూ.80,453 కోట్ల నిధులు రైతు బంధు పథకం కోసం విడుదల చేయగా.. అందులో రూ.25,672 కోట్ల సాగులో లేని భూములకు అందినట్లు నివేదికలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 157.43 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, 74.58 లక్షల మంది పట్టాదారులు ఉన్నారని నివేదికలో తెలిపారు. రాష్ట్రంలో ప్రతీ ఏటా 152.51 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తుంటారని వ్యవసాయ శాఖ వివరించింది. ఈ లెక్కన చూసినా సాగులో లేని సుమారు 4.92 లక్షల ఎకరాల భూములకు రైతు బంధు అందినట్లు తెలుస్తోంది.

'రైతు భరోసా'వర్తించని భూమి తక్కువే !

రాష్ట్రంలో 'రైతు భరోసా' సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సాగు యోగ్యం కానీ భూముల గుర్తింపు ప్రక్రియ దాదాపుగా పూర్తయింది. సాగు యోగ్యం కాని భూములకు పెట్టుబడి సాయం ఇవ్వకూడదని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో రైతు బంధు లబ్ధిదారుల్లో ఒకింత ఆందోళన వ్యక్తమైంది. అయితే, పట్టణ ప్రాంతాలకు దూరంగా ఉన్న పలు ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో సాగుయోగ్యం కానివి కింద అధికారులు గుర్తించిన భూములు చాలా స్వల్పంగా ఉన్నాయి. సర్వే జరిగిన పది గ్రామాల్లో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన పరిశీలనలో ఈ విషయం తేలింది. రియల్ ఎస్టేట్ వెంచర్లు, పరిశ్రమలకు మళ్లిన భూములు, రహదారుల కింద వదిలేసిన భూములు, రాళ్ల రప్పలున్న భూములు, ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములను మాత్రమే సాగు యోగ్యం కానివిగా అధికారులు గుర్తిస్తున్నారు. ఉదాహరణకు.. వరంగల్ ఉమ్మడి జిల్లా చిట్యాల మండలంలోని చైన్ పాక రెవెన్యూ గ్రామంలో 544 మంది రైతులకు చెందిన 1,264 ఎకరాలకు గతంలో రైతుబంధు సొమ్ము అందింది. అయితే, రైతు భరోసా సర్వేలో ఇందులో 21 మంది రైతులకు చెందిన 27.25 ఎకరాలను మాత్రమే సాగుకు పనికిరాని భూమిగా గుర్తించారు. అంటే, చైన్ పాక్ పరిధిలో సాగు యోగ్యం కాని భూమి స్వల్పమే.

- సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలో సుమారు 2,600 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో సాగు యోగ్యం కాని భూమి దాదాపు 20 ఎకరాలుగా గుర్తించారు. ఈ 20 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా వర్తించకపోవచ్చు.
- ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామంలో మొత్తం 1,638 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా అందులో 4.25 ఎకరాలను సాగుకు యోగ్యం కాదని తేలింది. కొత్తపల్లి గ్రామంలో 1071 ఎకరాలుండగా 4 గుంటల భూమి సాగు యోగ్యం కాని భూమి జాబితాలో చేరింది. లోదిపూర్‌లో 255 ఎకరాలకు గాను 4.10 ఎకరాలను, నాచారంలో 789 ఎకరాలకు గాను 8.36 ఎకరాలను సాగుకు యోగ్యం కాదని గుర్తించారు.
- నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం లింగాపూర్‌లోని 822 ఎకరాల భూముల్లో 3.07 ఎకరాలను సాగు యోగ్యం కానీ భూములుగా గుర్తించారు.
- నల్లగొండ జిల్లా గుడిపల్లిలో 1,516 మంది రైతులకు చెందిన 4,223 ఎకరాలకు రైతుబంధు అందేది. ఇందులో 30 మందికి చెందిన 20 ఎకరాలను సాగు యోగ్యం కాని భూమిగా గుర్తించి రైతు భరోసా నుంచి మినహాయించారు. చెరువులో పట్టాలు పొందిన మరో 14 మందికి చెందిన 35 ఎకరాల భూమి విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు.
- కరీంనగర్ మండలం ఇరుకుల గ్రామంలో 1348 మంది రైతులకు చెందిన 1223 ఎకరాల భూమికి రైతుబంధు అందేది. తాజా సర్వేలో ఇటుక బట్టీలు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్న 52 ఎకరాలను సాగు యోగ్యం కాని భూమిగా గుర్తించారు.
- ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్లారం రెవెన్యూ గ్రామంలో గతంలో 2585 ఎకరాల భూమికి రైతు బంధు వచ్చేది. రైతు భరోసా సర్వేలో 28 ఎకరాలను వెంచర్లగా గుర్తించారు. కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామంలో గతంలో 2912 ఎకరాలకు రైతు బంధు ఇచ్చేవారు. ఇప్పుడు సర్వేలో 20 ఎకరాలను వెంచర్ల భూమిగా గుర్తించారు.
- భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం సర్వారం రెవెన్యూ పరిధిలో మొత్తం 1089 ఎకరాల భూమి ఉండగా.. ఇళ్ల ప్లాట్లుగా మారిన 27 ఎకరాలను రైతు భరోసా నుంచి తొలగించారు.

దండుమైలారంలో 700 ఎకరాల కోత

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామంలో మొత్తం 5,526 ఎకరాల రెవెన్యూ భూమి ఉండగా 3,788 ఎకరాలకు రైతుబంధు అందేది. రైతు భరోసా సర్వేలో ఇందులో సుమారు 400 ఎకరాలను గుట్టల ప్రాంతంగా గుర్తించారు. మరో 300 ఎకరాల్లో వెంచర్లు, ఫామ్‌హౌజ్‌లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో సుమారు 700 ఎకరాలు సాగుయోగ్యం కాని భూములు జాబితాలో చేరినట్టు అయింది.

కనుల పండువగా త్రిశూలాల స్నానం



భక్తులతో కిటకిటలాడుతున్న వీరభద్రస్వామి ఆలయం



వీరభద్రుడికి గుమ్మడికాయ మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

- వీరభద్రస్వామికి పల్లెరం
- కొత్తకొండకు వేలాదిగా హాజరైన భక్తులు

భీమదేవరపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల్లో భద్రకాళి సమేత వీరభద్రస్వామి త్రిశూల స్నానం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం రోజున నిత్యహోమాన్ని ప్రారంభించిన అర్చకులు పూర్ణాహుతి కార్యక్రమంతో ముగింపు పలికారు. తొమ్మిది రోజులు విశేషంగా పూజలు నిర్వహించి కలశ పూజ చేశారు. బ్రహ్మోత్సవ కుంబాభిషేకం నిర్వహించారు. ఇందులో పాల్గొంటే సంవత్సరం కాలం పాటు దోషాలు నివృత్తి జరుగుతాయని స్వామివారిని దర్శించుకుంటారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను పల్లకి సేవలో ఊరేగించారు. వీరశైవులు పల్లెరంతో స్వామివారి వీధిలో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు సందర్భంగా వేలాది మంది భక్తులు స్వామి వారి పల్లెర కార్యక్రమాన్ని కన్నుల పండువగా తిలకించారు. అనంతరం పుష్కరిణి వరకు తీసుకెళ్లి, పవిత్ర పుష్కరిణిలో భూతబలిని నిర్వహించి పుష్కరిణిలో త్రిశూలస్నానం నిర్వహించారు. త్రిశూలేశ్వరిణితో పాటు అధికారులు, అర్చకులు,



పల్లెరం కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, సీఐ రమేష్, ఎస్ఐ సాయిబాబు

భక్తులు దివ్య స్నానం ఆచరించారు. త్రిశూల స్నానం ఆచరించే భక్తులు వారికిఉండే శరీర బాధలు, రోగ బాధలు, శత్రు బాధలు తొలుగుతాయని భక్తుల నమ్మకం. దీంతో శుక్రవారం ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుష్కరిణిలో స్నానం చేశారు. అనంతరం ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కిషన్‌రావు, చైర్మన్ చంద్రశేఖర్‌గుప్తా, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు, ప్రధాన అర్చకులు రాజయ్య, మొగిలిపాలెం రాంబాబు, వీరభద్రయ్య, వినయ్‌శర్మ, శ్రీకాంత్, శివకుమార్, శరత్‌చంద్ర, రమేష్, ఎర్రోజు రాజు సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రుడికి మొక్కులు చెల్లించిన ఎమ్మెల్యే పల్లా

కొత్తకొండ వీరభద్రస్వామిని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శుక్రవా రం దర్శించుకున్నారు. గుమ్మడికాయ మొక్కులు చెల్లించి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాను చిన్ననాటి నుంచి వీరభద్రస్వామి జాతరకు ఎడ్లబండిలో వచ్చేవాడినన్నారు. గత ఎన్నో సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యులతో కలిసి వీరభద్రస్వామిని దర్శించుకునేవారుమన్నారు. వీరభద్రస్వామి రాష్ట్ర ప్రజలను చల్లగా చూడాలని, ఆశీర్వదించాలని మొక్కుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చాడ సరిత, నాయకులు భూపతి రాజు, సంపత్, మహ్మద్ జానీ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భక్తుల రద్దీ

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చి మొక్కులు చెల్లించారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. క్యూలైన్లీ అన్ని కిక్కిరిసిపోయాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు బందోబస్తును నిర్వహించారు.

నేడు అగ్ని గుండాలు

వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండాల కార్యక్రమం శనివారం తెల్లవారు జామున నిర్వహిస్తామని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు. అగ్నిగుండాల్లో నడిచే భక్తుల శరీర బాధలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. దీంతో వీరభద్రస్వామి అగ్నిగుండంలో నడిచేందుకు భక్తులు పోటీ పడుతుంటారు.

ఐనవోలు ఆదాయం రూ.1.80 కోట్లు

హుండీల లెక్కింపు

ఐనవోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఐనవోలు మల్లన్న జాతర హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. 91 రోజులకు హుండీల ద్వారా రూ.31,59,335 లక్షలు రాగా వివిధ అర్జిత టిక్కెట్ల ద్వారా రూ. 1,48,67,173 కోట్లు వచ్చాయి. మొత్తం హుండీ, టిక్కెట్లు కలిపితే రూ.1,80,26,508 కోట్ల ఆదాయం సమకూరినట్లు ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. గత జాతరకంటే ఈ జాతరలో రూ.15,40,895 లక్షల ఆదాయం అదనంగా వచ్చింది. జాతరకు వచ్చిన భక్తులు హుండీల్లో మిశ్రమ వెండి బంగారం అభరణాలను స్వామి వారికి కానుకలుగా సమర్పించగా వాటిని తిరిగి హుండీల్లో వేసి సీల్‌చేసి భద్రపరిచారు. హుండీ లెక్కింపును దేవాదాయశాఖ వరంగల్ డివిజన్ పరిశీలకులు డి. అనిల్‌కుమార్ వ్యవహరించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాణి, పోలీసు సిబ్బంది రమేష్, రాజ్‌కుమార్‌లు బందోబస్తును పర్యవేక్షించగా మహబూబాబాద్‌కు చెందిన లక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు, ఒగ్గు పూజారులు, ఆలయ సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నారు.

అడ్డంకులు తొలగేదెన్నడో?

(5వ పేజీ తరువాయి)

కూడా ఇందులో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటితో పాటు 300 ఐసీయూ పడకలు, 1,399జనరల్ వార్డు పడకలు, 25 కీమో థెరపీ పడకలు ఇలా మొత్తం 2,100 పడకలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. 42 లిఫ్టులు, పెషేంట్ అటెంటెండ్స్ కోసం 450 పడకలతో ధర్మశాల, 8లక్షల కెపాసిటీతో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఒకేసారి ఆరు డెడ్‌బాడీలకు శవ పరీక్షలు చేసే వీలుగా పోస్టుమార్టం గదితో పాటు అనేక హంగులతో ఈ అస్పత్రి నిర్మాణం చేపట్టారు.

ఏడాది దాటినా పేదల వైద్యంపై పట్టింపేదీ?

వరంగల్‌ను హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని చెబుతున్న పాలకులు ఏడాది కాలంగా ఓరుగల్లులో వైద్యరంగాన్ని గాలికి వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కుగా ఉన్న వరంగల్ ఎంజీఎంకు పాలనాధికారి కూడా దిక్కులేని పరిస్థితి నెలకొంది. ఎంజీఎంలో కార్డియాలజీ, ఆర్థో, న్యూరో, పీడియాట్రిక్, గ్యాస్ట్రో తదితర కీలకమైన విభాగాల్లో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నా పట్టించుకునే వారు లేకుండా పోయారనే ఆవేదన వ్యక్తమవుతోంది. అంతేకాకుండా సిటీ స్కానింగ్, 2డీ ఎకో యంత్రాలు పని చేయకున్నా పట్టించుకునే వారు లేరు. దీంతో ప్రైవేటు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సి వస్తోందని పేదలు ఆందోళన చెందుతున్నారు. అలాగే రూ.1,725.95కోట్లతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ అస్పత్రి దాదాపు 70శాతం పూర్తవగా.. మిగతా పనిని పూర్తి చేసి పేదలకు సూపర్ స్పెషాలిటీ వైద్యం అందించేందుకు ప్రజాప్రతినిధులు కసరత్తు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విజిలెన్స్ విచారణ సాకుతో పనులు పూర్తి చేయకపోవటంతో పేదలకు పెద్ద రోగం వస్తే ప్రైవేటు అస్పత్రులకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. లక్షల్లో బిల్లులు చెల్లించేందుకు మెడలో తాళి.. ఉండే గుడిసెను అమ్ముకోవాల్సి వస్తుందని పేదలు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో వరంగల్ అభివృద్ధి పేరుతో హైదరాబాద్‌లో నాలుగైదు సార్లు, హనుమకొండ కలెక్టరేట్‌లో మూడు, నాలుగు సార్లు సమీక్షలు నిర్వహించారు. వరంగల్ ఎయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, వరంగల్ నగరంలో భూగర్భ డ్రెయినేజీలపైనే సమీక్షలు నిర్వహించారని, పేదలకు ప్రాణం పోసే వరంగల్ ఎంజీఎం దీనస్థితిపైనా, అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ అస్పత్రి నిర్మాణంపై ఏ ఒక్కసారి కూడా పూర్తి స్థాయిలో ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎయిర్‌పోర్టు, టెక్స్‌టైల్ పార్కు, భూగర్భ డ్రెయినేజీలతో పాటు ప్రజలకు ప్రభుత్వ వైద్యం కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని పాలకులు విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంజీఎంతో పాటు సూపర్ స్పెషాలిటీ అస్పత్రులను పట్టించుకోకుండా, కార్పొరేట్ అస్పత్రులకు అవకాశం ఇచ్చేలా నేతల తీరు ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉత్సాహంగా పోలీస్ క్రీడలు ప్రారంభం

» మూడో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2025ను ప్రారంభించిన సీపీ
» పోటీలకు హాజరైన వరంగల్ కమిషనరేట్ పరిధిలోని జట్లు
» ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలన్న అంబర్ కిషోర్ ఝా



పావురాలు, బెలూన్లు ఎగురవేసి క్రీడలు ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్ మూడో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ - 2025 శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జేఎన్ఎస్‌లో ఏర్పాటు చేసిన ఈ పోలీసు క్రీడలను సీపీ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించగా... కమిషనరేట్ పరిధిలోని సెంట్రల్, ఈస్ట్, వెస్ట్‌జోన్, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ (సీఏఆర్), లెథల్ వెపన్స్ జట్ల కెప్టెన్లు, జట్టు సభ్యులు గ్రౌండ్‌లో మార్చ్‌ఫాస్ట్ చేశారు. మూడు రోజుల పాటు 12 అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. తొలుత జాతీయ స్థాయి పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ కనబరిచిన పోలీస్ క్రీడాకారులతో క్రీడా జ్యోతిని గ్రౌండ్‌లో ప్రదర్శించి సీపీకి అందజేశారు. పావురాలను ఆకాశంలో ఎగురవేసి వాలీబాల్, పరుగు పందాలను ప్రారంభించారు. అలాగే కాజీపేటలోని సెయింట్ గ్యాబ్రియల్ గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా క్రీడల్లో రాణిస్తున్న పోలీసులు ఇతర క్రీడాకారులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. గెలుపోటములు ముఖ్యం కాదని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు పని ఒత్తిళ్లను అధిగమించి ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, జనగామ ఏఎస్పీ పండరీ చేతన్ నితిన్, ఏసీపీలు, సీఐ, ఆర్ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు పాల్గొన్నారు.



పరుగు పోటీలో పాల్గొన్న మహిళా పోలీసు క్రీడాకారులు



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న క్రీడాకారులు

'వర్గీకరణతోనే మాదిగల అభివృద్ధి'

సీరోలు, జనవరి17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు అభివృద్ధి చెందుతారని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. మన్నెగూడెంలో శుక్రవారం భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయడం వల్లనే ఆర్థిక అసమానతలు తగ్గి ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తారని పేర్కొన్నారు. పార్టీల కతీతంగా మాదిగలు కలసికట్టుగా హక్కులను సాధించుకొని, అన్ని రంగాల్లో రాణించేందుకు వర్గీకరణ ఏకైక మార్గమని పేర్కొన్నారు. గత ముప్పై సంవత్సరాలుగా వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్నామని తెలిపారు. మాదిగలు ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలన్నదే తమ లక్ష్యమని, అందుకు ప్రతీ ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు' అనే నినాదంతో బహిరంగసభ నిర్వహిస్తున్నామని, మాదిగలు పెద్ద సంఖ్యలో హాజరై సభను జయప్రదం చేయాలని కోరారు. మంద కృష్ణ మాదిగకు అంబేద్కర్ యువజన సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు సంఘీభావం తెలిపారు.

ఈ కార్యక్రమంలో నాయకులు గుగ్గిళ్ల పీరయ్య, తేలూరి ముత్తయ్య, వీరస్వామి, శ్రీనివాస్, కనకం బాబు, వంగూరి వెంకన్న, దైద భద్రయ్య, ఇనుగుర్తి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో సర్వేను పక్కాగా చేపట్టాలి

- అధికారుల సమీక్షలో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్


కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించిన సర్వేను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లా కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం రాత్రి స్థానిక సంస్థలు, రెవెన్యూ అదనపు కలెక్టర్‌లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, జిల్లా అధికారులతో కలిసి నాలుగు పథకాల క్షేత్రసర్వేపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ ఈనెల 26 నుంచి అమలు చేయబోతున్న ఈ నాలుగు పథకాల్లో షెడ్యూల్ ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన, గ్రామసభలను నిర్వహించి అర్హుల జాబితాను ఆమోదించడం చేయాలని అన్నారు. ఈనెల 20లోపు గ్రామాల్లో సర్వే నెంబరు వారీగా వ్యవసాయానికి యోగ్యం కాని భూముల వివరాలను నమోదు చేయాలని అన్నారు. భూమిలేని వ్యవసాయ కూలీలను గుర్తించడం, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. ప్రత్యేక అధికారులు సర్వేకు సంబంధించిన నివేదికలను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. మహబూబాబాద్ ఆర్డీవో కృష్ణవేణి, జడ్పీ సీఈవో పురుషోత్తం, డీఆర్‌డీఏ మధుసూదన రాజు, డీసీవో వెంకటేశ్వర్లు, డీపీవో హరిప్రసాద్, డీఏవో వసంత, ఏడీ సర్వే ల్యాండ్ అధికారి నరసింహస్వామి, మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఏవోలు పాల్గొన్నారు.

ప్రాచీన సంస్కృతిని భావితరాలకు అందించాలి

మహబూబాబాద్ టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ.. వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ యశోద గార్డెన్స్‌లో శుక్రవారం సంకీర్తన మండలి, వికాసతరంగిణి ఆధ్వర్యంలో ప్రాచీన కళాకారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పూర్వ కళలు, సంప్రదాయాల గూర్చి భావితరాలకు తెలియజేసి వాటి గొప్పతనాన్ని వివరించాలని సూచించారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడేందుకు వికాసతరంగిణి, సంకీర్తన మండలి చేస్తున్న కృషిని అభినందించారు. వికాసతరంగిణి వరంగల్, హన్మకొండ జిల్లాల కన్వీనర్ బి.రాధాకృష్ణ మాట్లాడుతూ చిన్నజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఏర్పాటైన సంకీర్తన మండలి ద్వారా వరంగల్ నగరంలో జూన్ 30న కళాకారులచే పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. అందుకు ప్రాచీన కళాకారులను గుర్తించి, ర్యాలీకి సమాయత్తం చేస్తున్నామని తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి,వికాసతరంగిణి బాధ్యులు దయాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ఓంనారాయణ లోయా, మదన్‌లోయా, నాయిని ఉమాదేవి పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి పరామర్శ


మృతుల కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల శివారు గాంధీపురం జీపీ పరిధిలోని వెంకట్రాతండాలో గురువారం రాయగిరి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తల్లీకూతుళ్ల అనూష, చైత్ర కుటుంబాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

21 నుంచి 24 వరకు వార్డు సభలు

- మానుకోట మునిసిపల్ కమిషనర్ రవీందర్

మహబూబాబాద్ టౌన్, జనవరి17 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపాలిటీ పరిధిలో రైతు భరోసా, ఇందిరమ్మ, రైతు ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల విషయంపై ఈనెల 21 నుంచి 24 వరకు వార్డుసభలను నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న తొలిరోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 1,2,14,19,21, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 3,13,15,22,28 వార్డులు, 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 4,9,16,23,33, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 5,10,24,30,36, 23న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 6, 11, 17, 25, 34, మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు 7, 12, 18, 26, 35, 24న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 8, 27,29, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 20, 31, 32 వార్డుల్లో సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఉద్యమకారుల ఫోరం కమిటీ ఎన్నిక

నెల్లికుదురు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల కమిటీని స్థానిక విశ్రాంతి భవనంలో శుక్రవారం ఎన్నుకున్నట్లు ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు తెలిపారు మండల అధ్యక్షుడిగా కుమ్మరికుంట్ల మౌనేందర్ ప్రధాన కార్యదర్శిగా కస్తూబోయిన విజయ్ యాదవ్, సలహాదారులుగా మద్ది వెంకన్న, జిలుకర యాలాద్రిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు ముద్దసాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈనెల 19న మహబూబాబాద్‌లో నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్నారపు వెంకన్నగౌడ్ వరిపెల్లి ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమకారులు తరలిరావాలి'

కేసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ అనంతారం దేవస్థానం నుంచి మానుకోట అమరవీరుల స్థూపం వరకు ఈనెల 19న ఉద్యమకారులు నిర్వహించే పాదయాత్రకు మండలంలోని తెలంగాణ ఉద్యమకారులు తరలిరావాలని ఆ ఫోరం మండల కమిటీ అధ్యక్షుడు చాగంటి కిషన్ కోరారు. కేసముద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు.

ఉప్పరపల్లిలో రెండు గడ్డివాములు దగ్ధం

కేసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఉప్పరపల్లిలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో కత్తుల కుమారస్వామి ఇంటి ఆవరణలో ఉన్న ఐదెకరాల గడ్డివాముకు నిప్పంటుకుంది. ఈ గడ్డివాము వెంటే ఉన్న బండి మంజులకు చెందిన ఎకరంన్నర గడ్డివాము సైతం మంటలు వ్యాప్తి చెందాయి. గ్రామస్థులు బిందెలు, మోటార్ పంపుతో నీళ్లు చల్లారు. ఈలోగా మహబూబాబాద్ నుంచి అగ్నిమాపక యంత్రం వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేయగా అప్పటికే గడ్డి కాలిపోయింది. ఈ ఘటనలో కుమారస్వామికి రూ.40 వేలు, మంజులకు రూ.15 వేలు నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉండగా గుర్తుతెలియని వ్యక్తులు తన గడ్డివాముకు నిప్పంటించారని కుమారస్వామి అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా ఉద్యమాలు కొనసాగించాలి : సీపీఐ

కురవి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అమరుల పోరాటస్ఫూర్తితో ప్రజాఉద్యమాలు కొనసాగించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కురవిలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మాజీ మండల కార్యదర్శి ఎన్.సురేందర్‌కుమార్ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. మండల కార్యదర్శి కర్నం రాజన్న, పోగుల శ్రీనివాస్, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, దొంతు రామ్మూర్తి, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, ఎన్.నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఎన్.రాజేందర్‌కుమార్, మహేష్, వేణు పాల్గొన్నారు.

గార్లలో శతాధిక వృద్ధురాలి మృతి


జయలక్ష్మి (ఫైల్)

గార్ల జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని రాతి స్తంభం బజార్‌కు చెందిన చిపా జయలక్ష్మి (105) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుడుంబా నిర్మూలనకు కృషి

- ఫిబ్రవరి 15 వరకు స్పెషల్ డ్రైవ్
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు


మాట్లాడుతున్న అంజన్‌రావు

తొర్రూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : గుడుంబా నిర్మూలనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు అన్నారు. శుక్రవారం తొర్రూరులోని ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 15 వరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు గుడుంబా నియంత్రణకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను సమన్వయం చేసుకుని డ్రైవ్ కొనసాగిస్తా మని వెల్లడించారు. గుడుంబా తయారీ కేంద్రాలు ఎక్కడ ఉన్నాయో ప్రత్యేక సమాచారం సేకరించి దాడులు చేస్తామని, అదే పనిగా గుడుంబా తయారు చేసిన, విక్రయాలు చేపట్టిన వారిపై పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గుడుంబా ప్రభావిత ప్రాంతాలు, దాని వలన కలిగే నష్టాలను వివరిస్తూ గ్రామీణ ప్రాంత ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. గతంలో కేసుల్లో ఉన్న వారిని బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. తొర్రూరు స్టేషన్ పరిధిలో గత సంవత్సరం 495 మందిపై కేసులు నమోదు చేసి 33 టన్నుల నల్లబెల్లం, 107వాహనాలను సీజ్ చేశామని, 283 మందిని బైండోవర్ చేశా మన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నల్లబెల్లం విక్రయాలు, గుడుంబా తయారీ చేస్తే చర్యలుంటాయని హెచ్చరించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో గుడుంబా ఆనవాళ్లు లేకుండా చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రవీణ్, ఎస్సైలు తిరుపతి, రవళిరెడ్డి, శంకర్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ సభలను జయప్రదం చేయాలి


పీవోడబ్ల్యూ మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా కార్యదర్శి పద్మ

మహబూబాబాద్ రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఈనెల 24న ప్రగతిశీల మహిళ సంఘం (పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి ఊకె పద్మ పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్‌లో ఆ పార్టీ కార్యాలయంలో మహాసభల విజయవంతం కోసం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, రాజకీయంగా అభివృద్ధి సాధించాలన్నారు. గుజ్జు కృష్ణవేణి, కవిత, పొన్నం రమ, లక్ష్మి, భట్టు బిన్నమ్మ, శివ్వారపు శారద, పద్మ, ప్రమీల, అనూష పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువ గండ్లను పూడ్చి నీటిని విడుదల చేయాలి : బీఆర్ఎస్

నెల్లికుదురు, జనవరి17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సారెస్పీ కాలువ గండ్లను పూడ్చి నీటిని విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరిపాటి వెంకట్‌రెడ్డి తెలిపారు. నెల్లికుదురులోని విశ్రాంతి భవంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలలో ఎస్సారెస్పీ కాలువలకు గండ్లు పడటంతో నీరు వృధాగా వెళ్లుతుందన్నారు. అధికారులు గండ్లుపూడ్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రబీలో నీరులేక రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చివరి ఆయకటు వరకు ఎస్సారెస్పీ నీరు అందే విధంగా కృషి చేయాలన్నారు. గుగులోత్ బిక్కునాయక్, భీముడు, శేటరాం పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయి : ఎస్సై

పెద్దవంగర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని ఎస్సై క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం చిట్యాలలో శ్రీగోత మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడలతో యువతలో పోటీతత్వం, స్నేహాభావం పెరుగుతుందన్నారు. గ్రామాల్లోని యువకులు సమాజ నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించాలన్నారు. క్రీడాకారులు తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో నైపుణ్యం పెంచుకొని రాణించాలని కోరారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే క్రీడల్లో రాణిస్తే ఉన్నత చదువుల్లో, క్రీడల్లో మంచి పునాది వేసినట్లు అవుతుందన్నారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు విద్య, ఉద్యోగాల్లో అవకాశాలు లభించి, బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. గుంటుక వెంకన్న, రాపోలు సామ్రాట్, రావుల వెంకటరంగారెడ్డి, మహేష్, దేశెట్టి మహేష్, శంతన్, యాకుబ్‌పాష, శ్రీధర్, యాకయ్య, శంకరయ్య, ఆదిత్య, రాము, ఖైరత్ పాషా, వెంకటేష్, సాయి, యకేందర్, సతీష్, శ్రీను పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలు, 420 హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. శుక్రవారం పెద్దవంగరలో ముఖ్యకార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అనంతరం ఇటీవల మరణించిన చెవిగోని రాములు (90), కుక్కల ఐలమ్మ (58) చిత్రపటాలకు పూలమాల వేసి, నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ గ్రామయూత్ కమిటీ అధ్యక్షుడిగా అనపురం రాజు, ప్రధాన కార్యదర్శిగా జలగం మల్లేష్, ఉపాధ్యక్షులుగా సతీష్, ఏదునూరి కల్యాణ్‌లను ఎన్నుకున్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీరాం సుధీర్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్, అనపురం రవి, శ్రీరాం రాము, నారాయణ, సతీష్, యాకయ్య, బిక్షపతి, వెంకటేశ్వర్లు, మందపూరి సతీష్, విజయ, మల్లేష్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు వర్తింపజేయాలి

మరిపెడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని సీపీఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మరిపెడలో జరుగగా, ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్ కార్డుల కోసం ప్రజా పాలనలో దరఖాస్తులు వందల మంది పెట్టుకోగా కొందరి పేర్లు రావడంతో అర్హులందరూ ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు పట్టణ కార్యదర్శి మల్లెపాక యాకన్న, ఏఐటీయూసీ నేతలు నారాయణ, అంజి తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

డోర్నకల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచందర్‌నాయక్ చేతుల మీదుగా ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కృష్ణవేణి శుక్రవారం తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో ఎంపీడీవో కార్యాలయానికి చేరుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు


మాట్లాడుతున్న ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటన్న

విలీన సభకు తరలిరావాలి

కొత్తగూడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఈనెల 19న నిర్వహించే రెండు అఖిల భారత రైతు కూలీ సంఘాల విలీన సభకు భారీగా తరలిరావాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బూర్క వెంకటయ్య పిలుపునిచ్చారు. బూరుగుంప, ముస్మిలో ముఖ్యకార్యకర్తలతో ఆయన మాట్లాడారు. నూతన ప్రజాస్వామ్య వ్యవస్థ ఆకాంక్షించి, అందరం ఒక్కటవుదామని కోరారు. ఎన్డీ సబ్‌డివిజన్ కార్యదర్శి ఇడంపాక శ్రీశైలం, యాదగిరి, యుగేందర్, గజ్జి సోమన్న, వజ్జ సోమక్క, ఈసం సారయ్య, ఈసం జగ్గారావు, జోగ వెంకటయ్య, పిట్టల దేవేందర్, గట్టి సురేందర్, పసునూరి రాజమల్లు, రామస్వామి, రాజా పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

చిన్నగూడూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఉగ్గంపల్లి, చిన్నగూడూరుగ్రామాల మధ్య ఉన్న ఆకేరువాగుపై ఆనకట్ట, గంగమ్మ, పెద్దమ్మ తల్లుల ఆలయాల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శుక్రవారం ఎంపీ బలరాం నాయక్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోబీజేపీ రాష్ట్ర నాయకుడు డీఎస్ వెంకన్ననాయక్ శుక్రవారం కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపీ పునర్నిర్మాణానికి నిధుల మంజూరు విషయం సీఎం దృష్టి తీసుకెళ్లానని, హామీ ఇచ్చారని వెంకన్న తెలిపారు.


ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న డీఎస్ వెంకన్న

ప్రజాసమస్యల పరిష్కారం కోసం పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి

కేసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నాటి స్వాతంత్ర్యం, తెలంగాణ సాయుధ పోరాటాల నుంచి నేటి ప్రజా సమస్యల పరిష్కారం వరకు సీపీఐ వందేళ్లుగా అలుపెరగని ఉద్యమాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. కేసముద్రంలో శుక్రవారం పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వందేళ్ల క్రితం బ్రిటీష్ పాలనలో పార్టీ ఏర్పడి రహస్య ఉద్యమాన్ని నిర్వహించిందని గుర్తుచేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి పిలుపునిచ్చి, 4వేల మంది అమరులయ్యారని తెలిపారు. పార్టీ ఆవిర్భవించి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఈనెల 25న మహబూబాబాద్‌లో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, సహాయ కార్యదర్శి మంద భాస్కర్, వరిపెల్లి వెంకన్న, మడత నారాయణ, చొప్పరి వెంకటయ్య, చక్రు, దాసరి సాయిలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


సర్వేను పరిశీలిస్తున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి వినయ్‌కృష్ణారెడ్డి

కొనసాగుతున్న రైతు భరోసా సర్వే

మహబూబాబాద్ అగ్రికల్చర్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రెండో రోజు శుక్రవారం రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలపై సర్వే కొనసాగింది. 82 క్లస్టర్లలో 75 గ్రామాల్లో జరిగింది. పెద్దవంగర మండలంలో గండ్లకుంటలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి, ఐఏఎస్ వినయ్‌కృష్ణారెడ్డి పర్యటించారు. రైతుభరోసా, రేషన్‌కార్డులపై ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో గణేష్, తహసీల్దార్ మహేందర్, ఎంపీడీవో వేణుమాధవ్, ఏవో స్వామినాయక్, కేసముద్రం మండలం పెనుగొండలో ఆర్డీవో కృష్ణవేణి, వ్యవసాయాధికారి బానోత్ వెంకన్న, గూడూరు, బయ్యారం మండలాల్లో జిల్లా వ్యవసాయాధికారిణి విజయనిర్మల రైతు భరోసా కార్యక్రమాలను పరిశీలించారు.

పీవైఎల్ జిల్లా సహాయ కార్యదర్శిగా అనిల్

నెల్లికుదురు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రగతిశీల యవజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా బంజర గ్రామానికి చెందిన ఇరుగు అనిల్‌ను శుక్రవారం నియమించారు. నెల్లికుదురు మండలకేంద్రంలో విశ్రాంత భవనంలో పీవైఎల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భగా అనిల్ మాట్లాడుతూ పీవైఎల్ బలోపేతనికి కృషి చేయనున్నట్లు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన వారికి కృజ్ఞతలు తెలిపారు.

ఇంకా.. 8 రోజులే

(5వ పేజీ తరువాయి)

చేశారు. విగ్రహాల ఏర్పాటుకు పట్టణంలో స్థలం కేటాయించాలని రజక సంఘం, గౌడ సంఘాల విజ్ఞప్తి మేరకు వీరనారి చాకలి ఐలమ్మ, సర్దార్ సర్వాయిపాపన్న విగ్రహ ఏర్పాటుకు ఆయా సంఘాల నాయకులతో కలిసి జిల్లా కేంద్రంలో స్థలాలను పరిశీలించారు. అదే విధంగా అనంతారం రోడ్‌లో అత్యాధునిక హంగులతో నూతనంగా నిర్మితమవుతున్న మునిసిపల్ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. తొర్రూరు బస్టాండ్ ప్రాంతంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇంటిగ్రేటెడ్ మోడల్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారులకు షాపులను కేటాయించి, దానిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

కేంద్రం నిధుల కోసం..

మహబూబాబాద్ పట్టణాభివృద్ధికి కేంద్రప్రభుత్వం ద్వారా రూ.300 కోట్ల నిధులు మంజూరి చేయించేలా కృషి చేయాలని మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి, వైస్‌చైర్మన్ వెంకన్న ఇటీవల హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతుహుస్సేన్‌నాయక్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు, వాటికి అవసరమయ్యే నిధుల వివరాలతో కూడినవినతిపత్రాన్ని అందించారు. కురవి రోడ్‌లోని ప్లైఓవర్ నుంచి బేతోలు వరకు జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-365పై డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు బీటీ రోడ్డుతో ఫోర్‌లైన్‌ను విస్తరణ, జిల్లా కేంద్రంలోని గాయత్రిగుట్ట నుంచి జమాండ్లపల్లి వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, ఫోర్‌లైన్‌ను విస్తరించేందుకు నిధులు కావాలని కోరారు.

సిగ్నల్ కాలనీ సమీపంలో ఇప్పటికే మంజూరైన రైల్వేఓవర్ బ్రిడ్జీ (ఆర్వోబీ)ని నిర్మించే విధంగా కృషి చేయాలని, ప్రధాన రహదారుల అభివృద్ధి, వరద నీటి కాల్వల నిర్మాణాలకు, ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిధులు మంజూరుచేయించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు పట్టణ పేదల కోసం 5 వేల ఇళ్లు మంజూరు చేయించాలని కోరారు.